క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(క్రైమ్): జిల్లా ఎస్పీ జీ కృష్ణకాంత్‌ను జిల్లా పోలీసు కార్యాలయంలో దళిత సంఘాల నేతలు, గుర్రం జాషువా డిజిటల్ గ్రంథాలయ కమిటీ సభ్యులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. ఎస్పీ దృష్టికి పలు విషయాలను తీసుకొచ్చారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ కేసుల్లో నిష్పక్షపాతంగా విచారణ జరిపించి నిందితులకు శిక్ష పడేలా చూడాలని, పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించాలని, డిజిటల్ గ్రంథాలయానికి సహకారం అందించాలని కోరారు. ఎస్పీని కలిసిన వారిలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పందింటి సుబ్బయ్య, విశ్రాంత పోలీసు అధికారి జాషువా, జాషువా డిజిటల్ లైబ్రరీ ముఖ్య సలహాదారులు డాక్టర్ కే రాజశిఖామణి, ఎస్కే ఖాసీం, కొమ్మల కృష్ణయ్య, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ మాజీ మెంబర్ కొప్పాల రఘు, మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కృపాకర్ తదితరులు న్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



నెల్లూరు సిటీ: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని జిల్లా విద్యాశాఖ అధికారి జే రామారావు అన్నారు. శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా నెల్లూరు రూరల్ మండలం ఆమంచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి డీఈఓ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులతో వారి తల్లి పేరుపై మొక్కలు నాటించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ అమ్మలా మొక్కలను సంరక్షించాలని పిల్లలకు సందేశం ఇచ్చారు. నిర్మాణంలో ఉన్న తరగతి గదుల వైపునకు విద్యార్థులు వెళ్లకుండా జాగ్రత్త తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అధికారిణి ఉషారాణి, డిప్యూటీ ఈఓ ప్రసన్నలక్ష్మి, ఏఎంఓ సుధీర్‌బాబు, సీఎంఓ పెంచలయ్య, ఎంఈఓ మురళీధర్ పాల్గొన్నారు.

చుంచుఎలుక కరిచి వ్యక్తి మృతి

నెల్లూరు సిటీ: ఇంట్లో నిద్రిస్తున్న వ్యక్తిని చుంచు ఎలుక కరవడంతో మృతి చెందిన ఘటన ములుముడి గిరిజన కాలనీలో చోటు చేసుకుంది. పోలీసులు వివరాల మేరకు..నెల్లూరు రూరల్ మండలం ములుముడి గిరిజనకాలనీకి చెందిన రాగయ్య(55), బంగారమ్మ దంపతులు. రాగయ్య రోజూలాగే శుక్రవారం ఉదయం పనికి వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగొచ్చారు. రాత్రి భోజనం చేసి ఇంట్లో మంచంపై నిద్రించారు. ఈ క్రమంలో చెంచుఎలుక అతడిని కరిచింది. రాగయ్యను స్థానికుల సహకారంతో కుటుంబసభ్యులు స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం నెల్లూరులోని జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ రాగయ్యను పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లుగా నిర్ధారించారు. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వరి పంట పరిశీలన

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో సాగులో ఉన్న వరి పంటను కేవీకే శాస్త్రవేత్త డీ విజయ్‌కుమార్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వవ్వేరు గ్రామంలో వరి పంట వెన్నుదశలో ఉందని, ఈ దశలో కాండం తొలుచు పురుగు ఆశించే ప్రమాదం ఉందన్నారు. దీని నివారణకు వ్యవసాయాధికారుల సూచనలు తప్పక పాటించాలని తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయాధికారులు మీరయ్య, కీర్తన తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్య రక్షణకు చర్యలు చేపట్టాలి

• ఎంపీపీ విజయకుమార్



మాట్లాడుతున్న ఎంపీపీ విజయకుమార్



సమావేశానికి హాజరైన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

నెల్లూరు సిటీ: వర్షాకాలం నేపథ్యంలో ప్రజాఆరోగ్య రక్షణకు అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీపీ విజయకుమార్ కోరారు. నెల్లూరు రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇటీవల కేరళలో కొత్త వైరస్ వచ్చినట్లు వార్తలు వస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో పంచాయతీల్లోని చెత్త, మురుగు నిల్వలు తొలగించి బ్లీచింగ్ చల్లాలని అధికారులకు సూచించారు. పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో మండలాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రతి మూడు నెలలకు జరిగే మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు విన్నవించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గతంలో కందమూరు హరిజనవాడకు బస్సు వచ్చేదని, ఇప్పుడు రావడం లేదని, బస్సు సర్వీసు ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని మండలాధికారులను ఆదేశించారు. ఎంఈఓ బిక్షాలు మాట్లాడుతూ నాడు–నేడు కింద నిధులు లేక పలు అభివృద్ధి పనులు నిలిచాయన్నారు. తల్లికి వందనంపై విధివిధానాలు ఇంకా రాలేదని పేర్కొన్నారు. ఆగస్టు 31వ తేదీ వరకు పాఠశాలల్లో అడ్మిషన్లు జరుగుతాయని తెలిపారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ రాజ్యలక్ష్మి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు అల్లాభక్షు, మండలం కోఆప్షన్ సభ్యులు మొహిద్దీన్, వైస్‌ఎంపీపీలు దేవసేనమ్మ, రవీంద్రరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

మహిళా ప్రజాప్రతినిధుల భర్తల హాజరుపై అభ్యంతరం

మండల సర్వసభ్య సమావేశానికి మహిళా ప్రజాప్రతినిధుల భర్తలు హాజరవడంపై ఇన్‌చార్జి ఎంపీడీఓ రాజ్యలక్ష్మి అభ్యంతరం తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు మాత్రమే ఉండాలని, మిగిలిన వారు బయటకు వెళ్లాలని సూచించారు. ఎంపీపీ విజయకుమార్ సైతం సభకు గౌరవం ఇచ్చి బయటకు వెళ్లాలని చెప్పడంతో భర్తలు బయటకు వెళ్లారు.

కాగితాలే విసనకర్రలు

ఎంపీడీఓ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరుగుతున్న సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో సమావేశం మొత్తం అధికారులు, సర్పంచ్‌లకు పుస్తకాలు, కాగితాలే విసనకర్రలు అయ్యాయి. దీంతో కొందరు సర్పంచ్‌లు అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

నేడు ఆదిశైవ బ్రాహ్మణ జిల్లా కార్యవర్గ ప్రమాణ స్వీకారం

నెల్లూరు(బృందావనం): ఆంధ్ర రాష్ట్ర ఆదిశైవ (అర్చక) బ్రాహ్మణ జిల్లా కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని బాలాజీనగర్‌లోని వాకాటి నరసయ్య త్యాగరాజ కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండకావూరు శేషగిరిరావు, గుడ్లూరు ఫణికుమార్‌శర్మ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా సంఘం చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివరించడంతో పాటు సంఘ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించనున్నట్లు వివరించారు. జిల్లాలోని సంఘీయులందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

నెల్లూరు సిటీ: హెల్పింగ్ హ్యాండ్ సొసైటీ ఆధ్వర్యంలో ధనలక్ష్మీపురంలోని ఉన్నత పాఠశాలలో మెగా రక్తదాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు ఆ సొసైటీ అధ్యక్షుడు కుంచాల విజయభాస్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రక్తదాతలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి



ఏడీ గ్లోరికుమారికి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి నాయకులు

నెల్లూరు (టౌన్): కేఎన్నార్ స్కూల్‌లో విద్యార్థి మృతి ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని ఏపీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆదిత్యసాయి కోరారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏడీ గ్లోరికుమారిని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు చదువు బాగా చెబుతారనే పేరు ఉండడంతో అధిక సంఖ్యలో విద్యార్థులు ఇక్కడ చేరుతారని తెలిపారు. భవన నిర్మాణం వద్ద కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు. భవన నిర్మాణం నాసిరకంగా ఉండడంతో పాటు మధ్యలోనే నిలిపివేశారన్నారు. భవన నిర్మాణంపై విజిలెన్స్‌తో విచారణ చేయించి ఘటనకు కారకులైన వారిని సస్పెండ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణయాదవ్, బాలు, వెంకటేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఫోర్జరీ సంతకం కేసును సీబీఐకు అప్పగించాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నగర కార్యదర్శి అరిగెల సాయి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన కేసును సీబీఐకు అప్పగించాలని సీపీఐ నగర కార్యదర్శి అరిగెల సాయి డిమాండ్ చేశారు. సంతపేటలోని సీపీఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన ఘటనలో సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం శుభపరిణామమన్నారు. అయినప్పటికీ కేసును త్వరితగతిన విచారణ చేసేందుకు సీబీఐకు అప్పగించాలని కోరారు. నగరంలో భవన నిర్మాణాలకు సంబంధించిన మార్టిగేజ్ నగదును పనులు పూర్తికాకుండానే గత కమిషనర్ వికాస్‌మర్మత్ సంతకాన్ని ఫోర్జరీ చేసి రిలీజ్ చేసి వాటి యజమానులకు అందజేయడం జరిగిందన్నారు. ఒక ఐఏఎస్ స్థాయి అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేయటం సామాన్యమైన నేరం కాదన్నారు. ఈ కేసులో అధికారులు, నాయకులు ఎవరెవరు ఉన్నారనే తేల్చకుండా క్రిమినల్ కేసు నమోదు చేసి చేతులు దులుపుకోవడం తగదన్నారు. ఈ కేసుకు సంబంధించిన విషయాలను పూర్తి స్థాయిలో బహిర్గతం చేసేవరకు సీపీఐ ఉద్యమాలు చేస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు నాగేంద్ర, జిలానీఖాన్, లీలామోహన్, ముక్తియార్, లక్ష్మయ్య, తదితరులు, పాల్గొన్నారు.

30న 'మిత్రరత్న' పురస్కారాల ప్రదానం

నెల్లూరు(బృందావనం): అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని పురమందిరంలో ఈ నెల 30న సృజన సాహిత్య, సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో 'మిత్రరత్న' పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు ఆ వేదిక అధ్యక్షుడు దగ్గుపాటి రాధాకృష్ణ శనివారం తెలిపారు. సాయంత్రం 6 గంటలకు జరిగే కార్యక్రమంలో స్నేహమాధుర్యాన్ని, స్నేహబంధం ఔన్నత్యాన్ని వివరించే సినీగీతాలపన పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 'స్నేహం'పై రాష్ట్రస్థాయిలో నిర్వహించిన కవితల పోటీల్లో విజేతలుగా నిలిచిన కవులకు ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన ఔత్సాహికులు 78938 47709 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పీర్లమాన్యం ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి



నెల్లూరు సిటీ: అల్లీపురంలోని పీర్ల మాన్యం ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని స్థానిక ముస్లింలు కోరారు. అల్లీపురంలో శనివారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నజీర్‌బాషా మాట్లాడుతూ ముస్లింల పీర్ల పండగకు సుబ్బరామిరెడ్డి 1916లో 49 సెంట్ల భూమిని దానంగా ఇచ్చారన్నారు. ఆ భూమిని శాశ్వత కౌలు చేసుకునే హక్కును బుచ్చిరాజు వీలునామా ద్వారా కల్పించారన్నారు. అయితే సదరు భూమిని కొందరు ఆక్రమించి లేఅవుట్ వేస్తున్నారని ఆరోపించారు. స్థానికులు దస్తగిరి, చాన్‌బాషా, చినిగిషా, కాలేషా పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న విశ్రాంత ఉపాధ్యాయులు

నెల్లూరు (టౌన్): విశ్రాంత ఉపాధ్యాయుల సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడును ఉమ్మడి నెల్లూరు జిల్లా విశ్రాంత ఉపాధ్యాయ సంఘ నాయకులు కోరారు. శనివారం వారు మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 11వ వేతన సవరణ కమిషన్ ప్రకారం 2018 జూలై 1 నుంచి 2021 డిసెంబర్ 31వ తేదీ మధ్య ఉద్యోగ విరమణ చేసిన వారికి రూ.12 లక్షల నుంచి రూ.16 లక్షల వరకు గ్రాట్యుటీ వర్తిస్తుందన్నారు. 2018 నుంచి పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలన్నారు. పాత విధానం ప్రకారం 7 నుంచి 10 శాతం, 12 నుంచి 15 శాతం వరకు అదనపు క్వాంటం పెన్షన్‌ను మంజూరు చేయాలన్నారు. ఈహెచ్ఎస్ క్యాష్‌లెస్ సౌకర్యాన్ని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పెంచాలన్నారు. పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లకు ఈహెచ్ఎస్ కార్డులను మంజూరు చేయాలన్నారు. రాష్ట్ర విశ్రాంత ఉపాధ్యాయ సంఘ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేతా సుధాకర్‌రెడ్డి, ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కందాటి రామిశెట్టి, ఉపాధ్యక్షుడు పీవీఎస్ నారాయణరావు, సంయుక్త కార్యదర్శులు మహేశ్వరయ్య, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న పీహెచ్‌పీ అసోసియేషన్ నాయకులు

నెల్లూరు(అర్బన్): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని సెట్నెల్ సీఈఓ వెంకటయ్య అన్నారు. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో సెట్నెల్ ఆధ్వర్యంలో బుజబుజనెల్లూరులోని పీఎంపీ జిల్లా కార్యాలయం నుంచి వల్లూరమ్మ కాలనీ వరకు విద్యార్థులు, పీహెచ్‌పీ సభ్యులు శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కాస్మోటిక్ డెంటల్ సర్జన్ డోలా సుస్మిత ర్యాలీని ప్రారంభించారు. చెట్లు నాటండి–ప్రకృతిని కాపాడండి, చెట్లు ప్రగతికి మెట్లు అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వల్లూరమ్మ కాలనీలో మొక్కలు నాటారు. సెట్నెల్ సీఈఓ వెంకటయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాలుష్యాన్ని నివారించి ప్రకృతిని కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పెంచాలని పిలుపునిచ్చారు. చెట్లు నీడనివ్వడమే కాకుండా మన ఆరోగ్యానికి అవసరమైన ఉత్పత్తులను అందిస్తాయన్నారు. సకాలంలో వర్షాలు కురిసేలా చేసి మనల్ని కాపాడుతాయన్నారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారి ఇమ్రాన్ మాట్లాడుతూ విద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల, వైద్యశాలల్లో పెద్ద సంఖ్యలో చెట్లు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌పీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, జిల్లా అధ్యక్షుడు శాఖ వరపు వేణుగోపాల్, నాయకులు దేవరకొండ శ్రీనివాసులు, మహబూబ్‌బాషా, రూడ్స్ సంస్థ చైర్మన్ రసూల్, పాఠశాల హెచ్ఎం మాధవి, సెటనెల్ మేనేజర్ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ గయాజ్‌అహ్మద్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మనుమసిద్ధినగర్‌లో ల్యార్వా పరిశీలన చేస్తున్న మలేరియా నివారణాధికారులు

నెల్లూరు(అర్బన్): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని గుంటూరు జోనల్ మలేరియా అసిస్టెంట్ డైరెక్టర్ వీర్రాజు అన్నారు. శనివారం ఆయన జిల్లా మలేరియా అధికారులతో కలిసి నగరంలో పర్యటించారు. మల్లికార్జునపురం పట్టణ ఆరోగ్యకేంద్రం, మనుమసిద్ధినగర్, తదితర ప్రాంతాలను సందర్శించారు. ఆయా ప్రాంతాల్లో ఇళ్లను సందర్శించి నీటితొట్టెలను పరిశీలించి అందులో దోమల లార్వాలు ఎలా ఉన్నాయో స్థానికులకు వివరించారు. దోమల లార్వాలు ఏ రకం దోమలకు చెందినవో తెలుసుకునేందుకు ల్యాబ్‌కు పంపారు. ఈ సందర్భంగా వీర్రాజు మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూసుకోవచ్చన్నారు. వర్షాకాలంలో దోమల ఉత్పత్తి ఎక్కువగా ఉంటుందన్నారు. వాటి కారణంగా మలేరియా, డెంగీ, బోధకాలు, చికున్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలుతాయన్నారు. ఏఎన్ఎంలు, వైద్యసహాయకులు ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. ప్రభుత్వ సూచనల మేరకు వారానికి ఒక్కరోజు ఫ్రైడేను డ్రైడేగా పాటిస్తూ ఇళ్లలోని నీటి నిల్వలను తొలగించాలన్నారు. తద్వారా ఇళ్లలో దోమల వృద్ధి జరగదన్నారు. ఇళ్ల పరిసర ప్రాంతాల్లో దోమల నివారణకు నీటి గుంటల్లో ఆయిల్‌బాల్స్ వేయాలని సూచించారు. అప్పుడే సీజనల్ వ్యాధులను నియంత్రించవచ్చన్నారు. ఆయన వెంట జిల్లా మలేరియా నివారణాధికారిణి హుస్సేనమ్మ, వార్డు సచివాలయ శానిటరీ సెక్రటరీ బృందం, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

ముగిసిన టీచ్‌టూల్‌పై శిక్షణ



ఉపాధ్యాయులకు సర్టిఫికెట్ల ప్రదానం

నెల్లూరు (టౌన్): గత పది రోజులుగా టీచ్ టూల్, క్లాసురూం అబ్జర్వర్స్ ప్రోగ్రాంపై ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ శనివారంతో ముగిసింది. దర్గామిట్టలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, స్టోన్‌హౌస్‌పేటలోని ఆర్ఎస్సార్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో గత పది రోజులుగా బ్యాచ్‌ల వారీగా 252 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఏఎంఓ సుధీర్‌బాబు, డిప్యూటీ ఈఓ ప్రసన్నలక్ష్మి హాజరై ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని నాలుగు డివిజన్ల పరిధిలో ఎనిమిది బ్యాచ్‌ల్లో 535 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. టీచ్‌టూల్ రాబోయే రోజుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఉపయుక్తమైన ప్రణాళికలను రూపొందించేందుకు ఒక సాధనంగా ఉపయోగపడాలన్నారు.

ఏపీసీబీఈఏ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న అసోసియేషన్ రాష్ట్రాధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆంధ్రప్రదేశ్ కోఆపరేటివ్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీసీబీఈఏ) బలోపేతానికి ప్రతిఒక్క ఉద్యోగి కృషి చేయాలని ఆ అసోసియేషన్ రాష్ట్రాధ్యక్షుడు తాతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని గాంధీబొమ్మసెంటర్ వద్ద ఉన్న జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో ఏపీసీబీఈఏ సర్వసభ్య , కేంద్ర కమిటీ కార్యవర్గ సమావేశాలను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వెంకటసుబ్బారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నెల్లూరు జిల్లా డీసీసీబీలో బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని బ్యాంకు సీఈఓను కోరామన్నారు. బ్యాంకు ఉద్యోగులకు 2022 నవంబరు నుంచి రావాల్సిన పీఆర్సీని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు మంచి పేరివిజన్ అందించాలనే ఉద్దేశంతో ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఉద్యోగుల సమస్యలు, డిమాండ్ల సాధనకు అసోసియేషన్ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. అసోసియేషన్ నూతన రాష్ట్ర జనరల్ సెక్రటరీగా కృష్ణాజిల్లా డీసీసీబీకు చెందిన గోపినాథ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో రాష్ట్ర స్థాయి అసోసియేషన్ జనరల్‌బాడీ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. గతంలో కంటే మంచి పే రివిజన్ పొందేలా అసోసియేషన్ కృషి చేస్తుందన్నారు. అసోసియేషన్ ముఖ్య సలహాదారుడు శ్యామ్‌ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి కుమార్‌పాల్, తొమ్మిది జిల్లాల నాయకులు శ్రీనివాసులు, కృష్ణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మురళీమోహన్‌రావు, కృష్ణారెడ్డి, అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు సుష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి హరివందన,తదితరులు, పాల్గొన్నారు.



• పచ్చ తివాచి



పెన్నా నది, స్వర్ణాల చెరువులో గుర్రపుడెక్క అల్లుకుపోయింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గుర్రపుడెక్క బాగా పెరిగిపోయింది. పెన్నా బ్యారెజ్ వద్ద, నెక్లెస్ రోడ్డులోని వినాయక నిమజ్జన ఘాట్ వద్ద పచ్చతివాచిలా పరుచుకుని కనువిందు చేస్తోంది. కాగా బ్యారెజ్ వద్ద అల్లుకున్న గుర్రపు డెక్కతో వర్షాకాలంలో పెన్నాకు వచ్చే వరద నీరు దిగువకు వెళ్లడంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. అందువల్ల ముందస్తుగా తొలగించాల్సిన అవసరం ఉంది.

-సాక్షి, ఫొటోగ్రాఫర్, నెల్లూరు.

నిమ్మ యార్డులో విజిలెన్స్ డీడీ తనిఖీలు

పొదలకూరు : స్థానిక నిమ్మ మార్కెట్ యార్డులో గుంటూరు మార్కెటింగ్ శాఖ విజిలెన్స్ డీడీ ఝాన్సీ శనివారం తనిఖీలు చేపట్టారు. వ్యాపారులకు కేటాయించిన దుకాణాల్లో బయటి వ్యక్తులు వ్యాపారాలు చేసుకుంటున్నారని ఫిర్యాదులు అందడంతో డీడీ తనిఖీలు చేపట్టినట్లుగా సమాచారం. మీడియాకు కూడా ఎలాంటి సమాచారం లేకుండా గోప్యంగా ప్రతి దుకాణానికి వెళ్లి విచారణ చేపట్టారు. వ్యాపారాల వివరాలను సేకరించడంతో పాటు బాడుగలు ఎవరికి చెల్లిస్తున్నారని ఆరాతీశారు. కొందరు ఇతరుల పేరుపై ఉన్న దుకాణాల్లో వ్యాపారం చేసుకుంటూ వారికి అద్దెలు చెల్లిస్తున్నట్లు డీడీ విచారణలో బహిర్గతమైనట్లుగా తెలిసింది. దీంతో వారి లైసెన్సులను రద్దు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.